


ఎవరో తలుపు తట్టారు.

చప్పుడు వినిన శ్యామల —

చదువుతున్న వీక్లీని చేతిలో పట్టుకుని లేచి నిల్చుంది కుర్చీలోనించి.

"ఆయనకాదు. ఆయన ఆఫీసుకు వెళ్లి గంట దాటింది. ఎవరైవుంటారు? ఆఫీసు ప్యూనేమో! ఏదో ఫైలుకోసం వచ్చివుంటాడు."

అనుకుంటూ తలుపు తీసింది.

ఎదురుగా —

తను అనుకున్నట్లు ఆఫీసు ప్యూనుకాదు. ఎవరో — అతనిని ఎప్పుడో ఎక్కడో చూసినట్లు జ్ఞాపకం.

కాని గుర్తురావటంలేదు...

"అలా గుర్తుపట్టనట్లు చూస్తావేం శ్యామలా! ముందు లోపలికి పద."

శ్యామల కదలలేదు.

అతనే శ్యామలను రాసుకుంటూ లోపలకు వచ్చాడు.

అతని ప్రవర్తన ఏమీ అర్థం కా లేదు శ్యామలకు.

సరాసరి వెళ్లి ప్రేము కుర్చీలో కూర్చున్నాడు.

'ఎవరితను? మేనర్స్ తెలియవా. తనని రాసుకుంటూ వచ్చి దర్జాగా కూర్చున్నాడు.'

"రా శ్యామలా" పిల్చాడతను నవ్వుతూ.

రెండడుగులు ముందుకు వేసింది శ్యామల.

"మీ రెవరో నాకు తెలీదు" అన్నది అతన్ని పరీక్షగా చూస్తూ...

హిప్పీ క్రాపు — పెద్ద కాలరు తెల్లని షర్ట్ — నిలువు గీతల నల్ల బెల్‌బాటమ్ పాంటు — లోతుకు పోయిన కళ్ళు — డేగ ముక్కు — వొత్తుగా పెరిగిన మీసాలు... విచిత్రంగా వున్నాడు...

"నన్ను గుర్తుపట్టలేదా శ్యామలా... నేను రామరాజును. మాధవరావు ఫ్రెండ్‌ని... మాధవరావు తెలుసుగా...?" శ్యామల కళ్ళలోకి చూస్తూ అడిగాడతను.

ఉలిక్కి పడింది శ్యామల!

'మాధవరావు స్నేహితుడా? తను ఏడాది క్రితమే మరచిపోయింది మాధవరావుని... మళ్ళీ ఇప్పుడు గుర్తు చేశాడితను.'

'ఇంతకీ ఇతను ఎందుకు వచ్చినట్లు?' శ్యామల హృదయంలో అనుమానం, భయం వేశాయి.

"ఎందు కొచ్చానని ఆలోచిస్తున్నావా?" కాలు మీద కాలు వేసుకుంటూ అడిగాడతను.

"ఇక కదిలేలా లేదు"

"ఎందుకన్న"ట్టు చూసింది అతని కళ్ళలోకి భయంగా శ్యామల.

"మాధవరావుకు నువ్వు రాసిన ప్రేమలేఖల్ని అయిదు వందలకు కొన్నాను. నా డబ్బు నాకు రావద్దూ. లాభం కూడా రావాలి. అందుకే నీ దగ్గరకు వచ్చాను. ఉన్నవాడినే చేసుకున్నావుగా" ఇంకా ఏదో చెబుతున్నా డతను.

శ్యామల గుండెల్లో రైళ్ళు పరిగెత్తుతున్నాయి.

అతను ఎందుకు వచ్చాడో పూర్తిగా అర్థమయింది. తనని బ్లాక్‌మెయిల్ చెయ్యటానికే?

'రెండేండ్ల క్రితం తను మాధవరావుకు రాసిన ప్రేమ లేఖల్ని ఇప్పుడు ఇతను అయిదు వందలకు కొన్నాడా?... ఛీ!'

"నేను ఎందుకు వచ్చానో అర్థ మయిందను కుంటాను" నవ్వా డతను.

శ్యామల మాట్లాడలేదు.

ఒకవైపు—గుండెదడదడా కొట్టుకుంటూంది.

మరోవైపు — మెదడును ఆలోచనలు తొలిచి వేస్తున్నాయి.

"శ్యామల పి. యు. సి. చదివేటప్పుడు మాధవరావును ప్రేమించింది. అప్పుడు యిద్దరూ ఎన్నో ప్రేమలేఖలు రాసుకున్నారు. మాధవరావు తనని పెళ్లి చేసుకుంటానన్నాడు. కాని చేసుకోలేదు. సొంత మామయ్య కూతుర్ని చేసుకున్నాడు. తర్వాత ఏడాదికి తన పెళ్లి జరిగింది. తనని రెండో సంబంధాని కిచ్చారు. అయినా ఆయనకు ఏళ్లు తక్కువే. ముప్పై అయిదు. తను మాధవరావుని మరచిపోయిందికూడా. మళ్లీ ఇప్పుడు అప్పుడు రాసిన ప్రేమలేఖల్ని మాధవరావు ఇతనికి అమ్మాడా? ఇంత నీచుడా? మాధవరావు? ఛీ...మగవాళ్లని నమ్మకూడదని ఎప్పుడో తెల్సుకుంది తను. కాని ఇంత ఘోరంగా ప్రవర్తిస్తారా డబ్బుకోసం."

మనసులో మాధవరావును ఎంతగానో తిట్టుకుంటూంది.

"ఇప్పుడు తనేం చెయ్యాలి? అతను ఎంత అడుగుతాడో. తను ఎక్కడినుంచి తెస్తుంది!"

అతనివైపు భీతాహంగా చూసింది.

ఠీవిగా కూర్చున్నాడతను. ధైర్యంగా —

"ఏమిటి ఆలోచిస్తున్నావు...? ఎంత అడుగుతానని ... ఎంతో అవసరంలేదు. వెయ్యి చాలు." అవలీలగా అన్నాడు.

"వెయ్యిరూపాయలా!" గుండెమీద చెయి వేసుకుంది!

"వెయ్యంటే నీకో లెక్కకాదని నాకు తెల్సు." మరోసారి నవ్వాడతను.

"ప్లీజ్ ... నన్ను బ్లాక్‌మెయిల్ చెయ్యకండి. ఒకప్పుడు మాధవరావును ప్రేమించాను. ప్రేమలేఖలు రాశాను. నిజమే. అది తప్పుకాదు. నేరం కాదు."

"నేరమో! కాదో! నాకు తెలీదు. నిజం కదా! నాకు డబ్బు కావాలి. ప్లీజ్! డోంట్ వేస్ట్ టయిమ్."

అతని ముఖం చూస్తుంటేనే తెలుస్తుంది జాలిపడే రకం కాదని.

"వెయ్యి రూపాయలు నాదగ్గర ఎట్లా వుంటాయి? ..."

## ప్రశ్నావళి

— కె. రామలక్ష్మి

డి. వి. ఎస్. కొండాపురం

మనిషికి విలువ దేనివల్ల వస్తుంది?

చూడండి, మనం పడిచచ్చే మానవ విలువలన్నీ వాలా సన్నని దారం నుంచే వేలాడుతూ వుంటాయి.

ఎస్. కె. ఎస్. పిడుగురాళ్ల

ఆడది అనర్థాలకు మూల కారణం అనే సామెత ఎంతవరకు నిజం?

ఎటువంటి ఆడది? అని మీరా సామెత ముందు — ప్రశ్న తగిలించాలి. వంచిత అయిన ఆడది; అణగ్రదొక్కబడిన ఆడది; జడ పదార్థంలా యీ వంఘం పడివుండమన్నా పడివుండలేక లోపల్లోపల కుళ్లిపోయే ఆడది. తన వూహాలవి ధైర్యంగా చెప్పలేక, తన కాళ్ల మీద తాను బ్రతకలేక — పూర్తిగా బానిస బ్రతుకు మినహా దారి లేని ఆడది — అనర్థాలకు కారణం. అంతే కాని — ప్రతి ఆడదీ కాదు.

కె. ఎస్. ఎన్. అనకాపల్లి

మారుతున్న కాలాన్నిపట్టి సమాజంలో స్త్రీ పాత్ర ఎటువంటిదై వుండాలి?

ఎప్పుడూ స్త్రీ పాత్ర బాధ్యతల బరువులో కృంగిపోయి నేలకరచే వుంది. మారుతున్న సమాజంలో — ముందు మారవలసినది — పురుషుడు.

కె. ఎల్. డి. ఇందోడు

మీకు వచ్చే ప్రశ్నలన్నీ మీరే సమాధానం చెప్తారా? లేక మీ పేరుతో ఎవరైనా సమాధానాలు చెప్తారా?

నా పేర ఎవరైనా చెప్తే అది నే చెప్పిన దేలా అవుతుంది చిట్టితల్లీ.

కె. జి. కె. కొమరగిరిపట్నం

బాహ్య సౌందర్యంకన్నా ఆత్మ సౌందర్యం గొప్పది అని నా ఫ్రెండు చెప్పాడు.

ఎలాంటి సౌందర్యానికైనా వ్యక్తిత్వం వుండాలి. వ్యక్తిత్వం లేని అందం విసుగు కల్గిస్తుంది.

సి. ఆర్. ఎన్. ధర్మవరం

మీరు నవల రాసేటప్పుడు ఎలాంటి నిబంధనలు పాటిస్తారు?

సాధారణంగా నిబంధనలు పెట్టుకోను! ఒంటిపొద్దు ఉంటావనీ, త్వరగా అచ్చయితే కొండ కొస్తాననీ మొక్కుకోను. బుర్రలో చాలాకాలంగా తిరుగుతున్న కథ — కొంచెం సమయం చిక్కినప్పుడు — కూర్చుని రాయాలని ప్రయత్నిస్తాను.

కె. బి. జి. కె. ఆర్. రాజమండ్రి

ప్రేమకు పేదరికం, ధనికవర్గం లేదు.

కాని మనుషులకి ఉన్నాయికదూ?!

ఎఫ్. ఎమ్. ఎస్. హైదరాబాదు

మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అంటారు. నిజమేనా?

రాత లెక్కడ రాసినా, అవి చెడేదీ, మనేదీ — యీ భూమ్మీదే!

టి. ఎల్. కంచికచర్ల

ఆర్ద్ర పురుగు అంటే ఎలా వుంటుంది? ఎప్పుడైనా చూశారా?

కంచికచర్ల లాంటి పల్లెల్లో వుంటూ—నువ్వు చూడలేదా లక్ష్మీ?... లేయెండ వెల్గుల్లో, మంచు ముత్యాలతో తడిసిన పాదుల లేతాకు పచ్చని ఆకులపై భగవంతుడు విసిరి చూసి ఆనందిస్తున్న పగడంలా నడయాడుతుంటుంది — ఈ మాటు చూడు.

జె. వి. ఆర్. విశ్వేశ్వరపురం

మనస్సుంది. చిన్న మనిషిని. ఒకర్ని చూసి కాదు. ప్రతి స్త్రీని అభిమానిస్తాను...

డేంజరే! అయితే మీ 'మనసు కోతికి' యింకా మానవ లక్షణాలు ఏర్పడలేదని తోస్తూంది!

జి. ఎస్. ఏలూరు

స్త్రీ పురుషులు ఎందుకు ఏకం అవుతారు?

ప్రకృతి సహజం — సగం—సగం— ఏకం కావడం—

మనిషి ఎందుకు పెళ్లిచేసుకోవాలి?

కన్నూ కాలూ వుడిగినప్పుడు, లోకం అంతా నిన్నొక భారంగా తలుస్తున్నప్పుడు — నీకై నిన్ను కని పెట్టి చూడాలని తహతహలాడే ఓ జీవి వుండాలనిపించుతే—ఉండడానికే— పెళ్లి. నీ సుఖం అందరూ పంచుకుంటారు. కాని కష్టాలు కూడా పంచుకొనేది — పెళ్లాం ఒక్కతే.

జి. వి. కె. ఆర్. విశాఖపట్నం

తలా తోకా లేని వన్నీ రాస్తూ 'కొత్తదనం' 'విప్లవతత్వం' అంటూ అరిచే వారినేం అనాలో అర్థకాదం లేదండీ కె. రా. గారూ?

తమ దైన ముద్రకి చిహ్నం కొత్తదనంకాదు — ఆత్మవిశ్వాసం — అని తెలియక వేసే కేక లవి...

డి. డి. పి. చాట్రాయి

సౌజన్యం, సంస్కారం, మంచితనం మానవీయత వీటి కెక్కడ చూచినా తిరుగులేని పరాజయం, సాటిలేని అవమానం కల్గుతూ, మంచివారికి నిరాశ నిస్పృహలు కలిగిస్తున్నాయి. ఈ దేశంలో న్యాయం కోసం విప్లవం రాదేం?

మరెందుకు — విప్లవం రావాలి, తేవాలి, తెస్తున్నాం అంటూ జానపద బాణీలలో కోకొల్లలుగా విప్లవ సాహిత్యం సృష్టిస్తున్నారని మీ ఉద్దేశ్యం?... న్యాయం కోసమే అనుకుంటున్నానే!

జి. వి. బి. హన్మకొండ

నేను జీవితంలో ఏ పని చేయాలన్నా నన్ను విధి చేయనీయడంలేదు. ప్రతి విషయంలో ఓడిపోతున్నాను...

ఉత్సాహం చంపుకో కూడదు తమ్ముడూ, అది మంచి ఔషధం లాంటిది. కాని నిరుత్సాహం వుందే — ఆ రోగానికి మందు లేదు. ఎముకల్ని కూడా కృంగదీస్తుంది.

కె. ఎస్. పి. ఖర్గపూరు

పిల్లలు తప్పులు చేయడం, దానికి తల్లి తండ్రులు బాధ పడ్డం — సహజమే కాని... వాళ్ళు...

తల్లి తండ్రులకి పిల్లలని ఒదులుకో గల శక్తి వుండాలి. వారి తెలివి మనది కాదు!

హెచ్. ఎస్. ఆర్. ఆదోని

ప్రాణికి జీవితం ఒక కల. మనిషికి జీవితం ఒక అనుభవం. మరి శవానికి...

ప్రాణికి జీవితం శ్రమ, మనిషికి జీవితం — అనుభవం కాదు—పరిశ్రమే. యిక శవానికి జీవితం — సుఖాంతం! (చచ్చినవాడి నే కష్టం తాకదు.)

అరవింద్, బి. కె. బళ్లాపూరు

మనిషి వందేళ్ల కంటే ఎక్కువ కాలం బ్రతకడని తెలిసే వెయ్యేళ్లకు సరిపడా సంపాదించాలని ఆరాటపడతా డెందుకు?

తన కోసం కాదు — తన సంతతి కోసం!

---

## ప్రేమలేఖలు

"క్యాష్ రూపంలో లేకపోయినా పర్వాలేదు..."

"అంటే?!" అర్థంకానట్లు ముఖం పెట్టింది శ్యామల.

"మెడలో గొలుసు వుందిగా?" ఆమె కంఠాన్ని చుట్టుకున్న బంగారు గొలుసువైపు ఆశగా చూస్తూ అన్నాడతను.

"ఈ గొలుసా!" శ్యామల కన్నీళ్ల పర్యంతమైంది.

"అవును. అది వెయ్యిరూపాయల కిమ్మత్తు చెయ్యదూ? అయినా పర్వాలేదు. డబ్బు లేదంటున్నావుగా..."

"గొలుసు లేకపోతే ఆయనకు అనుమానం వస్తుంది. ప్లీజ్. నన్ను పీడించకండి. ఆయనకు అనుమానం వచ్చిందంటే నా సంసారం నాశనమౌతుంది." దీనంగా అంది శ్యామల.

"డోన్ట్ వేస్ట్ మై టైం శ్యామలా... మళ్ళీ నాకు ట్రైనుకు టైమవుతుంది. నువ్వు గొలుసు ఇవ్వకపోయినా నీ సంసారం చెడిపోతుంది. ఆ లేఖలు మీ ఆయన కిస్తాను" లేచి నిలబడుతూ అన్నాడతను.

"గొలుసు ఇస్తే ఆ లేఖలు నా కిచ్చేస్తారా"

"ఆఁ... తర్వాత నేనేం చేసుకుంటాను."

ఒక్క క్షణం ఆలోచించింది శ్యామల.

'తను గొలుసు ఇస్తే ఆ లేఖలు ఇచ్చేస్తాడు. ఆ తర్వాత లేఖల్ని గురించి ఎలాంటి బెడద వుండదు. అంతగా ఆయన గొలుసు గురించి అడిగితే హుక్ వూడిందని పెట్టెలో దాచానని చెప్పవచ్చు. ఇప్పుడు తను గొలుసు ఇవ్వకపోతే ఇతను లేఖల్ని ఆయనకు చూపిస్తాడు. ఆ తర్వాత' ఆపైన ఆలోచించలేక పోయింది.

గొలుసు తీసి అతని చేతిలో పడేసింది. అలా పడేస్తున్నప్పుడు శ్యామల చెయ్యి వణికింది.

గొలుసును ప్యాంటు జేబులో పడేసుకుని "థాంక్స్ శ్యామలా... వస్తాను" అని నవ్వుతూ ముందుకు కదిలాడతను.

"ఆ లేఖలు?" వెళ్ళబోతున్న అతన్ని చూస్తూ అన్నది శ్యామల.

"సారీ శ్యామలా!" అంటూ వెళ్లిపోయాడతను.

"ఆ లేఖలు అసలు నా దగ్గర లేవు. మాధవరావు ఆ లేఖల్ని ఎప్పుడో చించేశాడేమో నాకు తెలీదు, అన్నట్లు నీకు తెలిదేమో! మాధవరావు చచ్చిపోయి ఏడాది కావస్తోంది. అతనికి కాన్సర్. అందుకే నిన్ను చేసుకోలేదు అతను. కాని నా అవసరంకొద్దీ నిన్ను యిలా పీడించాను" అని చెప్దామనుకున్నాడు, కాని చెప్పలేదు. పారిపోతున్నట్లు సందు మలుపు తిరిగి పోయాడు.

శ్యామల అతను వెళ్ళినవైపే చూస్తూ — స్థాణువులా కుర్చీలో కూలబడిపోయింది.